## క్లుప్తంగా

### విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమేశ్

**జమ్మికుంట:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా ప్రోత్సాహన్ యోజన స్కాలర్‌షిప్‌పై ప్రిన్సిపాల్ డా.రమేశ్ అధ్యక్షతన గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్కాలర్‌షిప్ పొందాలనుకునే విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో రెగ్యులర్ ఉత్తీర్ణులై 80 శాతం మార్కులు సాధించి ఉండాలని, దరఖాస్తు చేసుకునే వారు ఏ ఇతర స్కాలర్‌షిప్‌లు పొందుతూ ఉండకూడదని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.నాలుగు లక్షలలోపు ఉండాలని తెలిపారు. ఎంపికైన వారికి డిగ్రీ మూడేళ్లపాటు ఏటా రూ.12 వేలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో స్కాలర్‌షిప్ ఇంచార్జి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.ఓదెలుకుమార్, అధ్యాపకులు రాజేంద్రం, గణేశ్, రవి, సాయికుమార్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**హుజూరాబాద్:** ఐక్య ఉపాధ్యాయ పోరాట సమితి నాయకులు గురువారం తహసీల్దార్ కనకయ్యకు వినతిపత్రం అందించారు. విద్యా, ఉపాధ్యాయ రంగంలో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీ, ప్రమోషన్లు నిర్వహించాలని, సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలని, రిటైర్డ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పలకల ఈశ్వర్ రెడ్డి, ఎస్.చక్రధర్, తిరుపతిరెడ్డి, చంద్రగిరి మల్లేశం, అల్లి శ్రీనివాస్, కే.వెంకటస్వామి తదితరులున్నారు.

### వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్, సిబ్బంది

**జమ్మికుంట:** పట్టణంలో వావిలాల పీహెచ్‌సీ పరిధి అంబేడ్కర్ కాలనీలో డాక్టర్ మహోన్నత పటేల్ ,హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 54 మందికి వివిధ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. జ్వర పీడితుల రక్త నమూనాలను సేకరించి వ్యాధి నిర్ధారణ నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రత్నకుమారి, అరుణ, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్‌ఎంలు మంజుల, రజిత, ఆశాకార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### అధికారుల తనిఖీ



తనిఖీ చేస్తున్న తహసీల్దార్, ఏవో, ఎస్సై

**చిగురుమామిడి:** మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో కోళ్లఫారంలను గురువారం అధికారులు తనిఖీ చేశారు. వ్యవసాయంలో వాడాల్సిన యూరియాను కోళ్లదాణాలో వినియోగిస్తున్నారా అనే విషయంపై తహసీల్దార్ రమేశ్, ఏఓ రమ్యశ్రీ, ఎస్సై సాయికృష్ణ తనిఖీ చేశారు. యూరియా నిల్వ చేయొద్దని హెచ్చరించారు. వ్యవసాయ అవసరాల కోసమే వినియోగించాలని, పరిశ్రమలకు వాడినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రానైట్ పరిశ్రమలను సందర్శించారు.

### కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

**గన్నేరువరం:** సమస్యలు పరిష్కరించాలని ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు గురువారం ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. వేతనాలు సకాలంలో చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మాదిరిగానే బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఆపరేటర్లు రాజశేఖర్, శివసాయి, శంకర్, పద్మ పాల్గొన్నారు.

# కూలీల కొరత.. పెట్టుబడి తగ్గినట్టే

- వరిసాగులో ఆధునిక పద్ధతులతో రైతులకు అధిక లాభాలు
- నేరుగా విత్తే పద్ధతిలో త్వరగా పంటకాలం పూర్తి
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



డ్రమ్ సీడర్‌తో విత్తనాలు విత్తుతున్న రైతు

**జమ్మికుంట:** వరిసాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తే పెట్టుబడి తగ్గడంతోపాటు పంట త్వరగా కోతకు వస్తుందని, కూలీల కొరత, పెట్టుబడి తగ్గించుకునేందుకు రైతులు నేరుగా విత్తే పద్ధతిని అవలంబిస్తున్నారు. మరోవైపు వ్యవసాయ అధికారులు వెదజల్లే, డ్రమ్‌సీడర్ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నేరుగా విత్తే పద్ధతిలో లాభాలున్నాయని అధికారులు రైతులకు వివరిస్తూ పెట్టుబడి, కూలీల కొరత తీరుస్తున్నారు.

**లాభాలు**

ఎకరాకు 15 నుంచి 18 కిలోల విత్తనాలు వేసుకోవచ్చు. పంట పదిరోజుల ముందుగానే కోతకు వస్తుంది. నారు పీకడం, నాటు వేసే పని ఉండదు, సాగు ఖర్చు ఎకరాకు రూ.నాలుగు వేల వరకు తగ్గుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో విత్తుకోవచ్చు. కూలీల కొరత తగ్గడంతోపాటు సొంతంగా పని చేసుకోవచ్చు.ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంట కాలం కోల్పోకుండా అందుబాటులో ఉన్నప్పుడు వరిసాగు చేసుకునే అవకాశం ఉంది. డ్రమ్స్ సీడర్ పద్ధతిలో సాగు చేస్తే తెగుళ్ల తాకిడి తక్కువగా ఉంటుంది.

**విత్తనం, పొలం తయారీ..**

విత్తన రకాన్ని బట్టి ఎకరాకు 12 నుంచి 15 కిలోలు అవసరం. కాండం గట్టిగా ఉండి వేరు వ్యవస్థ దృడంగా ఉండే రకాలు ఎంపిక చేసుకోవాలి. రైతు ఇష్టమైన రకాలను సాగు చేసుకోవచ్చు. విత్తనాలను 24 గంటలు నానబెట్టి గోనే సంచిలో వేసి మండే కట్టాలి, మొలక వస్తే నాటుకు సిద్ధమని భావించాలి. సాధారణ వరిసాగు మాదిరిగానే భూమి సిద్ధం చేయాలి. పొలంలో నీరు ఎక్కువైతే బయటకు పోవడానికి ఏర్పాట్లు చేసుకోవాలి, బంకనేలలో చదను, దమ్ము చేసిన మరుసటి రోజు, ఇసుక శాతం ఎక్కువ ఉన్న నేలల్లో దమ్ము చేసిన రోజే విత్తుకోవచ్చు. మండె కట్టి మొలక వచ్చి విత్తనాలను విత్తుకోవాలి. చౌడు, క్షార, ఆమ్ల, ముంపునకు గురయ్యే భూముల్లో విత్తుకోవద్దు

**సబ్సిడీపై డ్రమ్ సీడర్..**

రాష్ట్ర ప్రభుత్వం నేరుగా విత్తుకునే పద్ధతిని ప్రోత్సహిస్తుంది. డ్రమ్ సీడర్ తక్కువ ధరకు సబ్సిడీపై అందిస్తుంది. రోజుకు ఎకరం నుంచి రెండెకరాల వరకు విత్తుకోవచ్చును. రైతులకు డ్రమ్ సీడర్స్ కిరాయికి ఇచ్చేందుకు వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**పెరగనున్న దిగుబడి**

సాధారణ సాగుతో పోల్చితే వెదజల్లే, డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగు చేస్తే పంట పది రోజుల ముందుగానే కోతకు వస్తుంది. అధిక దిగుబడి వస్తుందని అధికారులు, రైతులు తెలుపుతున్నారు.

### ఐదేళ్లుగా డ్రమ్ సీడర్‌తో నాటు



ఏడు ఎకరాల్లో ఐదేళ్లుగా డ్రమ్ సీడర్‌తో నాటు వేస్తున్నాను. కూలీల కొరత తీరుతుంది. ఏకారాకు రూ.ఐదు వేల చొప్పున నాటు వేసే ఖర్చు తగ్గింది. పొలం సాధారణ పొలం కంటే ఏపుగా పెరుగుతుంది. పంట దిగుబడి అధికంగా వస్తుంది.

– ఎండీ రహమాన్, అబాది జమ్మికుంట

### సద్వినియోగం చేసుకోవాలి



నేరుగా విత్తే పద్ధతిలో కూలీల కొరత ఉండదు, పెట్టుబడి తగ్గుతుంది. వ్యవసాయశాఖ అధికారులు, అనుభవం కలిగిన రైతుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. మెలకువలు పాటిస్తే లాభం, రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఖాదర్ హుస్సేన్, ఏవో, జమ్మికుంట



ఇల్లందకుంట: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ఆవరణ సమీపంలోని డంపింగ్‌యార్డ్‌ను తరలించాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని, ఈగలు, దోమలు వృద్ధిచెంది రోగాల బారిన పడే అవకాశం ఉందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామానికి దూరంగా డంపింగ్‌యార్డ్ తరలించి రోగాల బారినుంచి కాపాడాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేశ్వర్‌రావు, ఎంపీవో, ఇల్లందకుంట, సెల్ నం.98494 30892

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

## ఆహారం రోజూ రుచిగా వండాలి

- అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే
- కేజీబీవీ, పీహెచ్‌సీ తనిఖీ



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

**శంకరపట్నం:** ప్రతి రోజు ఆహారం రుచిగా వండాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. కేశవపట్నం కేజీబీవీని గురువారం సందర్శించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. ఓ విద్యార్థినితో బోర్డుపై రాయించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వంట గదిలోని సరుకులు, ఆహార పదార్థాలను పరిశీలించిన అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందిస్తున్నారా అని విద్యార్థినులను అడిగారు. తరగతి గదులు, వాష్‌రూమ్స్ శుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలన్నారు. అనంతరం కేశవపట్నం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఓపీ, ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించి ఆరా తీశారు. ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, తహసీల్దార్ సురేఖ, ఎంపీవో ప్రభాకర్, ఏఈ మల్లేశం, ఏపీవో శారద, వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, టీచర్లు, సిబ్బంది ఉన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠరెడ్డి

**కరీంనగర్:** విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. నగరంలోని బద్దంఎల్లారెడ్డిభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకుండా వారి చదువులకు నిధులు లేవని చెప్పడం సరికాదన్నారు. కరీంనగర్‌లో అన్ని రకాల సౌకర్యాలతో స్పోర్ట్స్ స్కూల్ ఉన్నప్పటికీ అంతర్జాతీయ స్టేడియం లేదని, వెంటనే కరీంనగర్‌లో అంతర్జాతీయ స్టేడియం నిర్మించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా కార్యదర్శి రమేశ్, నగర అధ్యక్షుడు రాము యాదవ్, నాయకులు అభిలాష్, సందీప్ రెడ్డి, బొల్లి సాయి కృష్ణ, సందీప్, వినయ్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

- ఫర్టిలైజర్ దుకాణాల్లో రూల్స్ పాటించాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



ఎరువుల బస్తాలు పరిశీలిస్తున్న కలెక్టర్

**తిమ్మాపూర్:** ఎరువుల దుకాణదారులు కృత్రిమ కొరతసృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పమేలా సత్పతి హెచ్చరించారు. తిమ్మాపూర్ మండలం అలుగునూరులోని సీఎస్సీ వీఎల్‌ఈ, శ్రీరామ ఫర్టిలైజర్ దుకాణాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. సబ్సిడీ ఎరువులను దారిమళ్లించినా.. బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు సమస్య ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ డిస్ ప్లే చేయాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారులు నిరంతరం దుకాణాలు తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, మండల వ్యవసాయాధికారి సురేందర్ తదితరులున్నారు.

**ప్రతీ పాఠశాలలో గ్రంథాలయం తప్పనిసరి..**

ప్రతీ పాఠశాల్లో తప్పనిసరిగా గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, విద్యార్థులు పుస్తకం చదువుకునేందుకు రోజుకు 45 నిమిషాల సమయం కేటాయించాలని కలెక్టర్ అన్నారు. ఎల్‌ఎండీ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ టీచర్ల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో ఓ గదిని గ్రంథాలయానికి కేటాయించాలని, లేని పక్షంలో ఓ కార్నర్ లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలతో ప్రతీరోజు న్యూస్ పేపర్, ఆదర్శవంతమైన వ్యక్తుల పుస్తకాలు, సైన్స్, కథలు చదివించాలన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న విద్యార్థి తప్పనిసరిగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే చేరే విధంగా చూడాలన్నారు. సమావేశంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ ఉన్నారు.

**పాఠశాల తీరుపై అసహనం...**

అలుగునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ పమేలా సత్పతి ఆకస్మికంగా సందర్శించారు. కంప్యూటర్లు, పలు డిజిటల్ వస్తువులు నిరుపయోగంగా ఉంచడం పట్ల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలోని అన్ని గదులను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. గ్రంథాలయానికి, కంప్యూటర్, డైనింగ్ హాల్, ల్యాబ్ వంటి వాటికి వేరువేరుగా గదులు ఉపయోగించుకోవాలని సూచించారు. స్థానిక అంగన్వాడీ కేంద్రాలు, భవిత సెంటర్లను ఖాళీగా ఉన్న గదుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు తప్పనిసరిగా యూనిఫాం ధరించేలా చూడాలని, క్రమశిక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

## కేటీఆర్ జన్మదిన వేడుకలు



రామడుగు: వెలిచాలలో సరుకులు, పండ్లు పంపిణీ

**హుజూరాబాద్/జమ్మికుంట/ఇల్లందకుంట/వీణవంక/రామడుగు/చిగురుమామిడి:** చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోని వివిధ మండలాల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్రాభివృద్ధిలో కేటీఆర్ పాత్రను వివరించారు. రామడుగు మండలం వెలిచాల గ్రామ పరిధి ప్రశాంత్ భవన్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలను సింగిల్ విండో చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి ఘనంగా నిర్వహించారు. పిల్లలకు నిత్యావసర సరుకులు అందజేశారు. మాజీ ఎంపీపీలు కిష్టారెడ్డి, మురళి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మామిడి తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మాటల ప్రభుత్వమే



మాట్లాడుతున్న కోమల్ల ఆంజనేయులు

**మానకొండూర్:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమల్ల ఆంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పాలన కుంటుపడిందని, కాంగ్రెస్ మాటల ప్రభుత్వమే కానీ చేతల ప్రభుత్వం కాదన్నారు.

**గన్నేరువరం:** స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకొని మండలంలో కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ నాయకుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్ అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.


**ఇల్లందకుంట:** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

**చిగురుమామిడి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. చిన్నముల్కనూర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్ నిర్వహించిన మండల స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అత్యధిక ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకుని కాషాయ జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యకర్తలు, నాయకులు, బూతుకమిటీ అధ్యక్షులు ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు.

**శంకరపట్నం:** స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపి శ్రేణులు సిద్ధ కావాలని ఎన్నికల ప్రభారి గుజ్జ శ్రీనివాస్ అన్నారు. కొత్తగట్టు గ్రామంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందన్నారు.

**చొప్పదండి:** ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చొప్పదండిలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల వర్క్ షాపులో మాట్లాడారు.

## వొడితెల రాజేశ్వర్‌రావుకు నివాళి



హుజూరాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

**హుజూరాబాద్:** పట్టణంలో గురువారం రాజ్యసభ మాజీ సభ్యుడు వొడితెల రాజేశ్వర్‌రావు వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. రాజ్యసభ సభ్యుడిగా అనేక సేవలు అందించాడని అన్నారు. అనంతరం బస్టాండ్‌ను సందర్శించి మహాలక్ష్మి పథకం ద్వారా ఎంతోమంది ఆడబిడ్డలు లబ్ధి చెందుతున్నారని, రాజకీయ ఉనికి కోసమే స్థానిక ఎమ్మెల్యే విమర్శలు చేస్తున్నారని అన్నారు.

**హుజూరాబాద్‌రూరల్:** కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రాజేశ్వర్‌రావు వర్ధంతి నిర్వహించారు. కళాశాల సెక్రెటరీ వొడితెల సతీశ్‌కుమార్ రాజేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శంకర్, రిజిస్ట్రార్ రాజేశ్వర్‌రావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.

**జమ్మికుంట:** పట్టణంలోని సాయి మానసిక దివ్యాంగుల పాఠశాలలో రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా అన్నదానం, పండ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పరాంకుశం కృష్ణస్వామి, చంద్రగిరి శ్రీనివాస్, సలీంపాషా, కొమరన్న, చల్లూరు బుచ్చిబాబు నిర్వాహకులు బుచ్చిరాములు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

- **కాంగ్రెస్ హామీలు అమలు చేస్తుంది**

**జమ్మికుంట:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై బీఆర్‌ఎస్ వైఖరి తెలపాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గురువారం పట్టణంలోని పలువురిని పరామర్శించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఎమ్మెల్యేకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. జమ్మికుంట నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు నడిచేలా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

- **వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు**

**శంకరపట్నం:** మండలంలోని కరీంపేట గ్రామానికి చెందిన శ్రీభక్తాంజనేయ భజన మండలి వండర్ బుక్ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకుంది. కళాభారతిలో ఆధ్యాత్మిక భజన పోటీలు నిర్వహించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డు పత్రం రాష్ట్ర కోఆరిరేటర్ నరేందర్ చేతుల మీదుగా భజన మండలి సభ్యులు అందుకున్నారు.

- **రెవెల్లి గ్రామానికి బస్సు**

**చొప్పదండి:** మండలంలోని రెవెల్లికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతో బస్సు వస్తోందని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్లాల అఖిల్ తెలిపారు. రుక్మాపూర్ మోడల్ స్కూల్‌కు వెళ్లడానికి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు విన్నవించగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడారని కృతజ్ఞతలు తెలిపారు.

- **సమస్య పరిష్కారమయ్యే వరకు దీక్ష**

**వీణవంక:** సమస్య పరిష్కారమయ్యే వరకు దీక్ష విరమించమని హిమ్మత్‌నగర్ గ్రామస్తులు స్పష్టం చేశారు. ఇసుక లారీలపై తాటిపత్రులు కప్పుతూ కొండపాక గ్రామస్తులే ఉపాధి పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

- **వర్షానికి కూలిన ఇంటి మెట్లు**

**శంకరపట్నం:** వర్షాలకు మండలంలోని కరీంపేటలో బొజ్జ మొగిళి ఇంటి మెట్లు కూలాయి. గత జీపీ పాలకవర్గం మురుగుకాలువ నిర్మాణం కోసం కందకం తీసి సీసీ వేయకపోవడంతో నీరు నిలిచి కూలిపోయిందని బాధితుడు తెలిపాడు.

- **అన్నదానం**

**హుజూరాబాద్:** జ్యోతిష్య పండితుడు గూడ జగదీశ్వర్‌శర్మ జన్మదినం సందర్భంగా గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వాసవీ అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు గందె శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రాధిక, గర్రెపల్లి శ్రీనివాస్, హరి శంకర్, కొయ్యడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

- **మూడు ఇళ్లలో చోరీ**

**చిగురుమామిడి:** మండలంలోని బొమ్మనపల్లి లో బుధవారం అర్ధరాత్రి మూడు ఇళ్లలో చోరీ జరిగిందని ఎస్సై సాయికృష్ణ తెలిపారు. కనపర్తి రవీంద్రాచారి, ల్యాగల రాజేశ్వరి, రిటైర్డ్ టీచర్ మాచమల్ల బొందయ్య ఇళ్లలో బంగారం, వెండి చోరీ చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

- **రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు**

**చొప్పదండి:** మండలంలోని గుమ్లాపూర్ గ్రామానికి చెందిన రైతు గడుగు లచ్చయ్య(55) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాలు.. లచ్చయ్య, భార్య అంజలితో ఉదయాన్నే చేను పనులకు వెళ్తుండగా గ్రామ సమీపంలోని గుట్ట వద్ద గ్రామానికి చెందిన వ్యక్తి కారుతో ఢీట్టాడు. లచ్చయ్య తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

- **కలెక్టర్‌కు ఫిర్యాదు**

**జమ్మికుంట:** మున్సిపల్ పరిధిలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో వర్షాకాలంలో వరదనీటితో ఇళ్లు మునిగిపోతున్నాయని ఆస్తినష్టం జరుగుతుందని, వరదకాలువ నిర్మాణం చేయాలని పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు, బీజేపీ నాయకుడు రవిచంద్రబాబు కలెక్టర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలు కూల్చి వరదకాలువ నిర్మాణం చేపట్టాలన్నారు.

- **నూతన కార్యవర్గం**

**చిగురుమామిడి:** చిగురుమామిడి మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూన సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా చిట్టేల విజయ్, ప్రధానకార్యదర్శిగా మ్యాదర అనిల్‌కుమార్, కోశాధికారిగా మల్యాల వెంకటేశ్, గౌరవాధ్యక్షుడిగా మంచికట్ల కనుకయ్య, గౌరవ సలహాదారుడిగా సదానందం, సురేశ్ ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా నగేశ్, శారంగపాణి, మెరుగు శ్రీనివాస్, దివ్యకరన్‌రెడ్డి ఎన్నికయ్యారని నూతన అధ్యక్షుడు సంతోష్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

- **విశ్వబ్రాహ్మణ సంఘం**

**చిగురుమామిడి:** చిగురుమామిడిలో విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడి గానదాచారి, ప్రధానకార్యదర్శిగా జనార్దన్‌చారి, సంఘం గౌరవాధ్యక్షుడిగా సుధాకర్, సలహాదారులుగాతిరుపతి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా అంజవ్వ, సహాయకార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా నరేశ్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వడ్లూరి కుమారస్వామి తెలిపారు. సుందరగిరిలో విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు.

## పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



**వీణవంక:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని బేతిగల్, ఎల్బాక, గంగారం గ్రామాల్లోని పదో తరగతి విద్యార్థులకు బీజేపీ మండల అధ్యక్షుడు బత్తిని నరేశ్‌గౌడ్, సీనియర్ నాయకులు నరసింహారాజు, గొట్టిముక్కుల సంపత్‌రావు సైకిళ్లు పంపిణీ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఇరవై వేల సైకిళ్లను కేంద్ర మంత్రి అందించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిలివేరు గణపతి, బాపన్న, వెంకటేశ్, బూత్ అధ్యక్షులు జీడిపల్లి రాజేశ్వర్‌రావు, చొప్పరి సారయ్య, పల్లెర్ల శ్రీనివాస్, ఐలయ్య, గొట్టిముక్కుల కోనారావు, దెంచనాది రాజగోపాలాచారి, రిటైర్డ్ టీచర్ దామోదర్ ఉన్నారు.